తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



ఘర్షణలో తీవ్ర గాయాలుపాలైన మహేష్

# మెడికల్ కాలేజ్ విద్యార్థుల మధ్య ఘర్షణ

## సీనియర్ విద్యార్థిని గొంతు కోసిన జూనియర్

తిరుపతి క్రైం, ఆగస్టు 15, ప్రభాతవార్త

ఎస్వి మెడికల్ కళాశాలలో డాక్టర్ అభ్యసిస్తున్న జూనియర్ సీనియర్ డాక్టర్ మధ్య గొడవ జరిగింది. హత్యాయత్నం దాకా దారి తీసింది. వెస్ట్ సిఐ జయనాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహేష్ప్రవీణ్ 2018లో డాక్టర్ చదువుతూ మెడికల్ కళాశాలలో చేరారు. గణేష్ అనే విద్యార్థి 2019లో కళాశాలలో చేరాడు. వీరు ముగ్గురు స్నేహితులుగా ఉన్నారు. సోమవారం రాత్రి మహేష్, ప్రవీణ్, గణేష్, ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్నారు. మద్యం మత్తులో డబ్బులు మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. మహేష్ గణేష్ని పరీక్షల తర్వాత నియంత చూస్తానని అన్నాడు. తరువాత అందరు కలిసి రాత్రి హాస్టల్కి చేరుకున్నారు. తెల్లవారుజామున సుమారు 4.30 నుంచి ఆరు గంటల ప్రాంతంలో గణేష్ మహేష్తన స్నేహితులు ఏమన్నా చేస్తారని భయపడి మహేష్ హాస్టల్ గదిలోకి చొరబడి క్రికెట్ స్టిక్తో తల మీద మోదాడు. పక్కనే ఉన్న సర్జికల్ బ్లేడుతో గొంతుకోయడానికి ప్రయత్నించాడు. మహేష్ కేకలు పెట్టగా పక్క రూములో ఉన్న ప్రవీణ్ వచ్చి ఆపడానికి ప్రయత్నించాడు. దీంతో మహేష్ని, ప్రవీణ్ను గణేష్ కొట్టి పరారయ్యాడు. విద్యార్థులు గాయపడిన విద్యార్థులను రుయా ఆసుపత్రికి తరలించారు. మహేష్కి వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. పరారీలో ఉన్న గణేష్ని పట్టుకోవడానికి పోలీసులు గాలిస్తున్నారన్నారు.

# భవిష్యత్ తరాలకు అభివృద్ధి బాటలు

## - 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్. పోలీసు వందనం స్వీకరిస్తున్న మంత్రి



జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్ చేతుల మీదుగా ప్రసంశాపత్రంను అందుకొంటున్న జడ్పీ సిఇఓ ప్రభాకర్రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీలు.

చిత్తూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త:

దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయులను స్మరించుకొంటూ భవిష్యత్ తరాల కోసం అభివృద్ధి బాటలు వేయాలని జిల్లా ఇన్ఛార్జీ మంత్రి, రాష్ట్ర శిశుసంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు కింద చేపట్టిన ఎన్నో వినూత్న పథకాలను జిల్లాలో అందరి సహకారంతో అమలు చేస్తున్నామన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్ మంగళవారం చిత్తూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్లో పోలీసుల వందనం స్వీకరించి జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావు, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, రాష్ట్ర ఈడిక కార్పొరేషన్ ఛైర్మన్ శాంతి, డిఆర్ఓ రాజశేఖర్, ఎఎస్పీలు నాగేశ్వరావు, సుధాకర్రావు, శ్రీలక్ష్మిలు, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, జడ్పీ సిఇఓ ప్రభాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ....- ఆరోగ్య సమాజ ఆవిష్కరణలో భాగంగా గ్రామీణ ప్రజలకు ఉత్తమ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 32 మండలాల్లో 44 సంచార వాహనాల ద్వారా 55 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ల ద్వారా సచివాలయ స్థాయిలో గడప గడపకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు .

## ఉత్తమ సేవలకు ప్రశంసలు

చిత్తూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త:

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులకు 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్, కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రసంశాపత్రాలు అందజేశారు. చిత్తూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డిఎంకె తులసీ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాధామ్మ, చిత్తూరు మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మనాభం, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, డ్వామా పిడి గంగా భవానీ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, జడ్పీ సిఇఓ ప్రభాకర్రెడ్డిలకు జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రసంశాపత్రాలు అందజేశారు.



ప్రసంశాపత్రం అందుకొంటున్న మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ., డిఆర్డిఎ పిడి డిఎంకె తులసీ.

### ఏఆర్ పెరేడ్ గ్రౌండ్లో

# ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



జెండా వందనం చేస్తున్న మంత్రి నారాయణస్వామి, అధికారులు

తిరుపతి క్రైం, ఆగస్టు 15, ప్రభాతవార్త

తిరుపతి ఏఆర్ పేరేడ్ గ్రౌండ్లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డిప్యూటీ సిఎం నారాయణ స్వామి, కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, ఎస్పి పరమేశ్వర రెడ్డిలు హాజరైయ్యారు. జాతీయ జెండాను ఎగురవేసిన డిప్యూటీ సిఎం నారాయణ స్వామి పెరేడ్ను సందర్శించి గౌరవ వందనాన్ని సీకరించారు. డిప్యూటీ సిఎం నారాయణ స్వామి పెరేడ్లో నవరత్నాల శకటాలు ఎంతో ఆకర్షణీయంగా నలిచాయి. ఎందరో అమరవీరుల త్యాగ ఫలమే దేశ స్వాతంత్ర్యం అని డిప్యూటీ సిఎం నారాయణ స్వామి తెలిపారు. భావితరాల వారిలో దేశ భక్తిని పెంపొందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల ద్వారా పేదల బతుకుల్లో వెలుగులు నింపారని తెలిపారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థతో సాకారం చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా చేయని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నామన్నారు. అతిదులుగా తిరుపతి ఎస్పి పరమేశ్వర రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి, తిరుపతి నగర మేయర్ శిరీష, జాయింట్ కలెక్టర్ బాలాజీ, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, వారు హాజరై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రితో పాటు జెండా వందనం సమర్పించారు. అనంతరం జిల్లాలోని ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేసారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖలకు సంబంధించిన శకటములు, దిశ పోలీస్ వాహనాల ప్రదర్శన, డాగ్ స్క్వాడ్ విన్యాసాలు చేసారు. అనంతరం పోలీస్ పెరేడ్ మైదానం నందు జిల్లాలోని వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను జిల్లా ఎస్పి, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులుతో కలిసి ఉప ముఖ్యమంత్రి కె. నారాయణ స్వామి సందర్శించి మెచ్చుకున్నారు. చివరగతా జతీయ గీతాలాపనతో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అట్టహాసంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో జిల్లా జేసి బాలాజీ, అదనపు ఎస్పిలు అడ్మిన్ వెంకటరావు, ఎల్ఆర్ఓ కుల వేఖర్, క్రైం విమల కుమారి, తిరుపతి మునిరామయ్య, ఏఆర్ లక్ష్మీనారాయణ, ఎస్బి డిఎస్పి గిరిధర్, డిఎస్పిలు యశ్వంత్, సురేంద్ర రెడ్డి, కాటమరాజు, నరసప్ప, నందకిశోర్, చంద్రశేఖర్, లక్ష్మణ రావు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొని జెండా వందనం సమర్పించారు.



### వ్యవసాయ శకటానికి

## మొదటి బహుమతి

చిత్తూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త:

చిత్తూరు పోలీసు శిక్షణా కేంద్రంలో మంగళవారం జరిగిన 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ప్రదర్శించిన శకటాలు సంక్షేమాభివృద్ధిని అద్దం పట్టాయి. పోలీసు శిక్షణా మైదానంలో ప్రభుత్వ శాఖలు తయారు చేసిన శకటాలను జిల్లా ఇన్ఛార్జీ మంత్రి ఉషశ్రీ చరణ్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్రెడ్డి తదితరుల సమక్షంలో ప్రవేశపెట్టాయి. వ్యవసాయ శాఖ రూపొందించిన శకటం మొదటి బహుమతి దక్కించుకోగా డ్వామా శకటానికి ద్వితీయ, జిల్లా పంచాయతీ అధికారి శకటానికి తృతీయ బహుమతి లభించింది. శకటాల ప్రదర్శనలో ప్రథమంగా పోలీసు శాఖ శకటం దిశ పోలీసింగ్ వ్యవస్థ, ఫాల్కాన్ వాహన ప్రదర్శనతో సాగింది. అనంతరం అగ్నిమాపక శాఖ మిస్ట్ బుల్లెట్, మిస్ట్ జీప్, ఐఎఫ్బి బోట్, రెస్క్యూ టెండర్ వాహనాల ప్రదర్శన సాగింది. అనంతరం చిరుధాన్యాల పంట, డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా పథకాలపై అవగాహన కల్గిస్తూ వ్యవసాయశాఖ శకటం సాగింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఉపాధి హామీ, జల్శక్తి అభియాన్, సమగ్ర గ్రామీణాభివృద్ధి లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలతో కూడిన శకటంను ప్రదర్శించింది. డిఆర్డిఎ వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా చేపడుతున్న పిన్షన్ల పంపిణీ, చేయూత, మహిళా మార్ట్, వైఎస్ఆర్ చేయూత, ఆసరా పథకాలు తెలిపే శకటంను ప్రదర్శించింది. గృహ నిర్మాణ సంస్థ నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు తెలుపుతూ శకటంను ప్రదర్శిస్తే, సివిల్ సప్లై తన శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలతో శకటంను ప్రదర్శించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఫ్యామిలీ డాక్టర్ విధానం, 104, తల్లిబిడ్డ ఎక్స్ప్రెస్, 102, 108 వాహన సేవలపై శకటం ప్రదర్శించింది.

### అనుమానంతో

# భార్యను హత్య చేసిన భర్త..!

నారాయణవనం, ఆగస్టు 15 ప్రభాతవార్త :





భర్త చేతిలో హత్యకు గురైన గాయత్రి,

కట్టుకున్న భార్యపై అను మానం పెంచుకున్న భర్త నిద్రపో తున్న భార్యను బండరాయితో తలపై గట్టిగా మోది చంపిన వైనం నారాయణవనం మండల పరిధి లోని బ్రాహ్మణాతాంగేల్ పంచా యతీ పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘనటలో గాయత్రి(32) దుర్మ రణం చెందింది. ఈ ఘనటకు సంబందించి పూర్తి వివరాలు ఇలా వున్నాయి. బ్రాహ్మ ణాతాంగేల్ పంచాయతీ వడ్డీళ్లకు చెందిన వెంకటేష్ అలియాస్ పండుకి అరణ్యకండ్రిగ పంచాయతీ ఈశ్వరయానాధికాలనీకి చెందిన గాయత్రి(32)తో 12 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటికే వెంకటేష్కి వడ్డీళ్లకు చెందిన రేవతితో వివాహం జరిగి ఆమెకు ఇద్దరు పిల్లలు వున్నారు. వెంకటేష్ ఆటో నడుపుకొనే సమయంలో పరిచయం అయిన గాయత్రితో ప్రేమలో పడ్డాడు. ఆ తర్వాత ఆమెకు తాళి కట్టి అదే గ్రామంలో వేరు కాపురం పెట్టాడు. వీరికి ఇద్దరు పిల్లల సంతానం కలిగారు. ఇటీవల కాలంలో గాయత్రి గాజులు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నది. అయితే వెంకటేష్ అలియాస్ పండు మాత్రం ఇద్దరు భార్యతో కాపురం చేస్తూ టమోటా వ్యాపారం చేస్తున్నాడు. అయితే గాయత్రి గాజులు అమ్ముకొనే చోట వేరే వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి తనను పట్టించుకోవడం లేదని కక్ష పెంచుకున్నాడు. దీంతో ప్రతి రోజు పండు మద్యం సేవించి గాయత్రితో గొడవ పడేవాడు. ఇటీవల కాలంలో పండుగాడు అప్పులు ఎక్కువగా చేయడంతో మద్యం సేవించడం ఎక్కువైంది. మంగళవారం ఉదయం 7గంటలకు గాయత్రి తన ఇంట్లో నడుపుతున్న చిల్లర కొట్టులో ఇద్దరు పిల్లలు వున్నారు. ఈ ఇద్దరు పిల్లలు బయటకు రాకుండా వుండే విధంగా తలుపుకు తాళం వేశాడు. అనంతరం ఆరు బయట మద్యం సేవించిన పండు సిమెంట్ రాయితో తళపై గట్టిగా మోది చంపేశాడు. రక్తపు మడుగులో విఘతజీవిగా పడి వున్న గాయత్రిని తన ఇద్దరు కుమారులకు చూపించి ఆటోలో పరారయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న పుత్తూరు రూరల్ సిఐ సురేష్కుమార్, నారాయణవనం, పిచ్చాటూరు ఎస్ఐలు పరమేష్నాయక్, వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ జయరాంనాయక్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. అనంతరం మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి శవ పంచనామా కోసం తరలించారు. కేసు ధర్యాపు చేస్తున్నారు.

## మంత్రి వస్తే దుకాణాలు మూయాలా?

*శ్రీకాళహస్తి, ఆగస్టు 15 ప్రభాతవార్త*

*శ్రీకాళహస్తీశ్వరాలయంలో పూజలు జరిపించుకొనుటకు దేవాదాయశాఖ మంత్రి వస్తుంటే ఇంత హంగామా చేయాలా? అనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కొందరు భక్తులు క్రమం తప్పకుండా ఉదయం సాయంత్రం స్వామి అమ్మవార్లను స్థానిక భక్తులు దర్శించుకుంటారు. మంత్రి వస్తున్నారని సోమవారం రద్దీ సమయంలో పారిశుద్ధ్యానికి పూనుకొని ఓ కార్మికుని మృతికి కారకులయ్యారు. గతంలో మంత్రులొచ్చారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులొచ్చారు. ఎప్పుడూ హంగామాల్లేదు. ఏర్పాట్లు లేదు. అయితే ఈ సారి ఎందుకో మంత్రి వస్తున్నారని స్థానిక అధికారులు, సిబ్బంది హంగామా సృష్టి స్తున్నారు. ఎందుకింత హంగామా అని చూపరులు ముక్కున వేలేసుకుంటున్నారు. మరీ విచిత్ర విషయం ఏమిటంటే కొందరు బుధవారం మంత్రి రాక సందర్భంగా 'దుకాణాలు'కూడా మూయాలని సూచించటం చర్చనీయాంశంగా మారింది. అమావాస్య ఘడియల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. వ్యాపారాలు జరిగే రోజుల్లో నిబంధనలు విధించటం విమర్శలకు అవకాశం కల్గిస్తుంది.*

# టిటిడి ఉద్యోగులకు వెండిడాలర్, ప్రశంసాపత్రాలు





తిరుపతి, ఆగస్టు 15ప్రభాతవార్త:

ధార్మికసంస్థ టిటిడిలో భక్తులకు మెరుగైన సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు వెండిడాలర్, ప్రశంసాపత్రాలతో అభినందించారు. 77వ స్వాతంత్ర్యదినోత్సవం మంగళవారం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో జరిగింది. ఈ వేడుకల్లో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, అడిషనల్ సివిఎస్ఒ శివకుమార్రెడ్డి, ఎస్వీబిసి సిఇఒ షణ్ముఖకుమార్, సిఎఒ శేషశైలేంద్ర, ఐటి జిఎం సందీప్రెడ్డి, ఎస్ఇ2 జగదీశ్వరరెడ్డి, పిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఇఒలు భాస్కర్, రాజేంద్రుడు, శెల్వం, ఆరోగ్యఅధికారి శ్రీదేవి, విజిఒ బాలిరెడ్డి ,గిరిధర్, మనోహర్, పిఆర్ఒ డాక్టర్ తలార రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడానికి కృషి చేస్తామని ఆయన ఉద్ఘాటించారు. టిటిడిలో పనిచేస్తున్న ఉద్యోగులకు త్వరలోనే ఇళ్ళస్థలాలు ఇస్తామని ప్రకటించారు. టిటిడిలో వివిధ హోదాల్లో, పలు విభాగాల్లో ఉత్తమ సేవలందించిన 30మంది అధికారులు, 219మంది ఉద్యోగులకు, ఎస్వీబిసిలో ఏడుమంది ఉద్యోగులకు 5గ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. ఉద్యోగుల పిల్లలకు సంబంధించి ఇంటర్లో ప్రతిభకనబరచిన 26మంది విద్యార్థులకు 2,116రూపాయలు, పదవతరగతిలో ప్రతిభ కనబరచిన 32మంది విద్యార్థులకు 1,116 రూపాయలు నగదు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## అంతరిక్ష కేంద్రంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



శ్రీహరికోట (తడ), ఆగస్టు 15 ప్రభాతవార్త

శ్రీహరికోటలోని సతీష్ధవన్ అంతరిక్ష కేంద్రంలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్తో పాటు పలువురు డిప్యూటీ డైరెక్టర్లు వివిధ ప్రాంతాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా స్థానిక స్పేస్ సెంట్రల్ స్కూలు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిఐఎస్ఎఫ్ గౌరవ వందనాన్ని అందుకున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలను బహూకరించారు. శ్రీహరికోట నుంచి జరిగిన రాకెట్ ప్రయోగాల గురించి ఆయన వివరించారు. విద్యార్థులలో దేశభక్తి సామాజిక సేవ అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా స్పేస్ సెంట్రల్ స్కూలు విద్యార్థులు చేసిన యోగా, పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ, సిఐఎస్ఎఫ్ కమాండెంట్ రేఖానంబియార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే షార్ డిప్యూటీ డైరెక్టర్లు సయ్యద్ హమీద్, గ్రహం దొరై, టిఎస్ రఘురామ్, టివి రమణారెడ్డి తదితరులు శ్రీహరికోటలోని పలు ప్రాంతాల్లో జాతీయ జెండా ఎగురవేశారు. డిఓఎస్, డిఆర్డిఎల్, కెఆర్పి కాలనీలలోనూ మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిపారు.

## భక్తులకు సౌకర్యవంతమైన దర్శనమే ధ్యేయం

### -స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో టిటిడి ఇఒ ధర్మారెడ్డి





తిరుమల, ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:

ఆపదమొక్కులవాడా గోవిందా...అనాథరక్షకా గోవిందా అంటూ తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికి సులభ, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ధ్యేయంగా టిటిడి ఉద్యోగులు సేవలందించాలని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. భక్తులకు టిటిడి ఉద్యోగులు అంకితభావంతో మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలందించాలని ఇఒ ఉద్ఘాటించారు. 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో మంగళవారం ఉదయం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం ఆవరణలో మువ్వెన్నల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఇఒ ధర్మారెడ్డి భద్రత సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పిల్లలకు ,ఉపాధ్యాయులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ2 జగదీశ్వర్రెడ్డి, విజిఒలు బాలిరెడ్డి, గిరిధర్, డిప్యూటీ ఇఒలు లోకనాథమ్, భాస్కర్, సెల్వం, రాజేంద్ర, ఇఇ సురేంద్రరెడ్డి, డిఇ ఎలక్ట్రికల్ రవిశంకర్రెడ్డి, ఏవిఎస్ఒలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

బంగారుపాళ్యం, ఆగస్టు 15 ప్రభాతవార్త:



77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మండల పరిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు బెన్నురాజ్, ఎంపిడిఓ కార్యాలయం, ఎంఆర్‌సి కార్యాలయాల్లో ఎంపిపి అమరావతమ్మ, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శిరీష, తుంబకుప్పం పిహెచ్‌సిలో డాక్టర్ లోహిత్, పోలీస్ స్టేషన్‌లో సిఐ నాగరాజు, బంగారుపాళ్యం గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, మొగిలి వెంకటగిరిలో సర్పంచ్ దీప్తి శిరీష్‌రెడ్డి, తగ్గువారిపల్లిలో సర్పంచ్ వాణిప్రియ, ఎస్సీ బాలికల హాస్టల్‌లో వార్డెన్ సుజాత జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, ఎంపిడిఓ మధుసూధన్‌రెడ్డి, ఎంఇఓ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

## అడవి జంతు మాంసం పట్టివేత - నలుగురు అరెస్టు

బంగారుపాళ్యం, ఆగస్టు 15 ప్రభాతవార్త: మండలంలోని నలగాంపల్లికి చెందిన నలుగురు వ్యక్తులు అటవి మాంసం వారి గృహాల్లో వండుతుండగా అటవీ శాఖ అధికారులు పట్టుకొన్నారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి నలగాంపల్లి సమీపంలో అడవి పందిని మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన అడవి పందిని నలగాంపల్లి దళితవాడకు చెందిన గోపాల్, గిరిబాబు, మధు, శివాజీలు తీసుకెళ్ళారు. తమ నివాస గృహాల్లో మాంసంను ఉడికిస్తుండగా అటవీశాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు ఉడుకుతున్న మాంసంను స్వాధీనం చేసుకొన్నారు. నలుగురిని అదుపులోకి తీసుకొని జిల్లా అటవీశాఖ కార్యాలయంకు తరలించినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ తెలిపారు.

## జాతీయ జెండా రెపరెపలు

గుడిపాల, ఆగస్టు 15 ప్రభాతవార్త: 77వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని మంగళ వారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాల యాలు, సంస్థలు, పాఠశాలల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిడిఓ రాజశేఖర్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజశేఖర్, సింగిల్‌విండో కార్యాలయంలో ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డిలు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో డిటిలు కళ్యాణి, వంశీకృష్ణలు, ఆర్ఐ రమసాయి, సర్వేయర్ గణేష్, అధికారులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ జెండాను ఎగురవేశారు.

## ఉత్తమ తహసిల్దారుగా బాబు

పాలసముద్రం, ఆగస్టు 15 ప్రభాతవార్త:



చిత్తూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాలసముద్రం మండల తహసిల్దారు బాబు ఉత్తమ తహసిల్దారుగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్ చేతుల మీదుగా ప్రసంశాపత్రం అందుకొ న్నారు. తహసిల్దారు బాబు, ఇన్‌ఛార్జ్ ఇఓఆర్డీ రమేష్‌బాబులు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చేతుల మీదుగా ప్రసంశాపత్రాలు ఇవ్వడం ఆనందంగా వుందన్నారు.

## ఐరాలలో ఘనంగా జెండా పండుగ

ఐరాల ఆగస్టు 15 ప్రభాతవార్త : ఐరాల మండలంలో మంగళవారం 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడులకను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చింతం మోహన్, తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుశీల, పోలీసు స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వర్లులు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈకార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు,వైకాపా నాయకులు సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,ధనచంద్రారెడ్డిలతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. పుత్రమద్ది గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 24 మంది సైనికులు, మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పాలసముద్రం, ఆగస్టు 15 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు, తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు బాబులు జాతీయ జెండాలను ఎగురవేశారు. జిల్లా వైకాపా సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజు, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, జడ్పీటీసీ అన్బుగలన్, తహసిల్దారు బాబు, ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, డిటి మధుబాబు, ఎపిఓ మార్గరేట్, ఎఓ విద్యావతి, టెక్నికల్ అసిస్టెంట్ అనూష, ఇఓఆర్డీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కుప్పం, ఆగస్టు 15 ప్రభాతవార్త



76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహిం చారు. ద్రవిడ వర్సిటీలో ఉపకులపతి ఆచార్య రామకృష్ణ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి పతాకావిష్కరణ చేశారు. కుప్పం మండల కార్యాలయం, రెస్కో, మున్సిపల్, మార్కెట్ కార్యాలయాల వద్ద ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని, జడ్పీటిసి శరవణ తదితరులు పతాకావిష్కరణలో పాల్గొన్నారు. కుప్పం తెదేపా కార్యాలయం వద్ద ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్ పతాకావిష్కరణ చేశారు. పిఇఎస్ వైద్య కళాశాలలో డీన్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు పతాకావిష్కరణ చేశారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ పతాకావిష్కరణ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ పార్వతి, టౌన్‌బ్యాంక్ వద్ద ఛైర్మన్ భాగ్యరాజ్, స్థానిక గాంధీ విగ్రహం వద్ద పట్టణ ప్రముఖులు పతాకావిష్కరణ చేశారు. బిజెపి కార్యాలయం, కాంగ్రెస్ కార్యాలయాల్లో ఆయా పార్టీల నేతలు పతాకావిష్కరణ గావించారు. దోభీఘాట్ వద్ద రజక సంఘ నేతలు పతాకావిష్కరణ చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు.

**శాంతిపురం :** మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల సచివాలయం, వివిధ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. మఠం పాఠశాలలో జడ్పీటిసి శ్రీనివాసులు పతాకావిష్కరణ చేసి స్వాతంత్ర్యం సిద్ధించిన తీరు వివరించారు. ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ మునిరత్నం గౌడు, ఎస్సై మునస్వామిలు పతాకావిష్కరణ చేశారు. స్థానిక పరమహంస యోగానంద పాఠశాలలో జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్‌లు పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులు జాతీయ నేతల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పిసి కమిటీ ఛైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వి.కోట :** మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. స్థానిక మండలపరిషత్, వెలుగు కార్యాలయాల వద్ద జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మువరాజ్, వైస్ ఎంపిపి తమీమ్ ఖాన్, ఎంపిడిఒ, ఎంఇఒ చంద్రశేఖర్, నేతలు కుమార రాజా, శశికళ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

## తవణంపల్లె ఎస్సై సుధాకర్‌రెడ్డికి ఉత్తమ సేవా అవార్డు

తవణంపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త: తవణంపల్లె ఎస్సై పివి.సుధాకర్‌రెడ్డికి మంగళవారం ఉత్తమసేవా అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలను అందించినందులకు గాను 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రం చిత్తూరులో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. దీనితో మండలంలోని పలువురు అధికారులు ఎస్సై సుధాకర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

## తవణంపల్లెలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తవణంపల్లె, ఆగస్టు 15 ప్రభాతవార్త:

భారత 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మండలంలో మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ గుణశేఖర్‌రెడ్డి,, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గీత, పోలీసు స్టేషన్‌లో సుధాకర్‌రెడ్డి, పీహెచ్‌సీలో ...., వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ జి.ప్రవీణ్, అరగొండ మేజర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ మల్లుదొరై ప్రశాంత్‌కుమార్, అపోలో ఆస్పత్రిలో ఏఓ చంద్రశేఖర్‌రెడ్డిలు జాతీయ జెండాను ఎగుర వేశారు.

**వినాయక విద్యామందిర్‌లో...**

మండలంలోని ఐరాల క్రాస్ సమీపంలోని శ్రీవినాయక విద్యామందిర్ పాఠశాలలో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్.గణపతినాయుడు జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ భాస్కర్ చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికల హైస్కూల్‌కు 4.90లక్షల విలువ చేసే ఫర్నీచర్ అందజేత

కుప్పంరూరల్, ఆగస్టు 15 ప్రభాతవార్త

కుప్పం పట్టణంకు చెందిన అశ్వర్థ నారాయణశెట్టి కుమార్తె జయశ్రీ జ్ఞాపకార్థం మంగళవారం జయశ్రీ కృష్ణమూర్తి స్థానిక బాలికల హైస్కూల్‌కు 4.90లక్షల విలువ చేసే పరికరాలను విరాళంగా అందించారు. టేబుళ్లు, అల్మారాలు, ఛైయిర్లు, సైన్స్ ల్యాబ్ టేబుళ్లను హెచ్‌ఎం వెంకటేశ్వరబాబుకు అందించారు. కార్యక్రమంలో ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, శ్వేతదీప గ్యాస్ ఏజెన్సీస్

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వాడ వాడల మువన్నెల జెండా రెపరెపలు

వెదురుకుప్పం, ఆగస్టు 15 ప్రభాతవార్త :



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురష్కరిం చుకుని మంగళవారం వాడవాడల మువన్నెల జెండా ఎగురవేసి వదనం సమర్పించారు. మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో ఎంపీపీ నాగరాణి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీ నారాయణ, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ వెంకటేష్, ట్రాన్స్ కో కార్యాలయంలో ఏఇ రామాంజనేయులు, వెలుగు కార్యాలయంలో ఎపియం కవిత, వ్యవసాయ కార్యాలయంలో ఏవో కవిత,హౌసింగ్ కార్యాలయంలో ఏఇ వృధ్వీ, మండల విద్యా వనరుల కార్యాలయంలో యంఇవో దామోదరం, ఉన్నత, ప్రాథమికోతన్న, ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, సచివాలయాలల్లో పంచాయితీ కార్యదర్శులు, వెదురుకుప్పం ఉన్న త పాఠశాల క్రీడమైదానం పీసీసీ సభ్యులు పోటుగారి భాస్కర్ జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చలం పాళ్యం సుకుమార్,సర్పంచ్ శిల్పా శంకర్, ఎంపీటీసీ పుత్తూరు రాధిక పురంధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, నాయకులు ధనంజేయులు రెడ్డి, రోసు రెడ్డి, వెంకటేష్, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగధనుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యం - చిత్తూరు ఎంపి రెడ్డెప్ప

కుప్పం, ఆగస్టు 15ప్రభాతవార్త

త్యాగధనుల పోరాట ఫలితమే దేశ స్వాతంత్ర్యమని చిత్తూరు ఎంపి రెడ్డెప్ప పేర్కొన్నారు. మంగళవారం కుప్పంలో వివిధ చోట్ల ఆయన జాతీయ పతాకావిష్కరణ గావించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల కృషితోనే స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. నేడు ఆ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామన్నారు. సా ్థనిక బాలుర హైస్కూల్‌లో ఎంపిపి అశ్విని అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సంబరాలిచ్చిన జెండాపండుగ వేడుకలు

పుంగనూరు,ఆగస్టు 15 ప్రభాతవార్త :

పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో స్వాతంత్ర్యదినోత్సవాలు వేడుకగా జరిగాయి.మంగళవారం ఉదయం పట్టణంలోని రెవిన్యూ,రిజిస్ట్రార్,మండలపరిషత్తు,విద్యాశాఖలతో పాటూ పలు ప్రభుత్వశాఖల వద్ద జాతీయపతాకాలను ఎగురవేసి,సంబరాలు నిర్వహించుకున్నారు.మండలపరిషత్తు కార్యాలయం వద్ద ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేశారు. రెవిన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ సీతారాం,విద్యాశాఖ కార్యాలయం వద్ద చంద్రశేఖర్‌రెడ్డిలు పతాకాన్ని ఎగురవేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిజిస్ట్రార్ బాలాజీ పతాకాన్ని ఎగురవేశారు.

## అర్బన్ సిఐ శ్రీధర్‌కు ఉత్తమ సేవా ప్రశంసాపత్రం

కుప్పం, ఆగస్టు 15 ప్రభాతవార్త



కుప్పం అర్బన్ సిఐ శ్రీధర్‌కు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవా ప్రశంసాపత్రాన్ని అందించారు. విధి నిర్వహణలో చూపిన విశేష కృషికి ఆయనకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అలాగే గుడుపల్లె ఎస్సై లక్ష్మీకాంత్, కుప్పం పోలీసులు ఫైరోజ్, సుందరరాజులకు సైతం ప్రశంసాపత్రాలు అందించారు.

## మదర్ థెరిసా పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

పెద్దపంజాణి ఆగష్టు15 ప్రభాతవార్త :

మండలంలోని లింగాపురం సమీపంలోని మదర్ థెరిసా(సిబిఎస్ఈ) పాఠశాలలో మంగళవారం 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.పాఠశాల డీన్ వై.మధుసూదన్ రెడ్డి,ప్రిన్సిపాల్ డేవిడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంగీత,సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఫ్యాన్సిడ్రస్.కవితల పోటీలు,ఆర్ట్,క్రాఫ్ట్,వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతు అందజేశారు.పాఠశాల కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు,విద్యార్థుతుల తల్లిదండ్రులు పాలొకగన్నారు.

---

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

చిల్లకూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త

చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయి పంచి పెట్టారు. అదే విధంగా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బి. గోపాల్, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె. శ్రీనివాసులు జెండా ఎగురవేసారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పరిశ్రమల వద్ద కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా తూర్పు కనుపూరు గ్రామంలో ఉన్న నవనీత ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్‌ఎం శ్యామ్ బాబు ఆధ్వర్యంలో జెండా వందనం కార్యక్రమం అత్యతంత వైభవంగా నిర్వహించారు. అదే విధంగా తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రమ్య సర్వే రామకుమార్, సాయి విశాలాక్షి, భార్గవి, శశిధర్, అచ్యుత్‌తో పాటు ఎంఈఓ రఫీ, వైద్యశాలలో గీతామణి, అరఫ్, రాజేశ్వరి, పోలీస్ శాఖలో రఫి, ఏ. నరేష్, పంచాయితీ కార్యాలయంలో ప్రవీణ, రాజా, సుజాత, మనోజా, కిరణ్ కుమార్, అవినాష్, పాఠశాలలో మణికుమార్, కోదండరామ్‌తో పాటు విఆర్ఎ రాథాకీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్, మంత్రి వర్యుల చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నిర్మల దేవి, వైద్యులు పాల్ జేమ్మెన్, ప్రసన్న, ప్రిన్సిపల్ బాలచెన్నయ్య, ఉపాధ్యాయులు, అన్నీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి



కోట,ఆగస్టు,15 ప్రభాతవార్త

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలం లోని విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో ఘనంగా ఈ వేడుకలు జరిగాయి. విద్యానగర్ లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీ రింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల డైరెక్టర్, విజయకుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్.సిసి. అధికారి లెఫ్టినెంట్, జి.మాధయ్య, అన్ని విభాగాధిపతులు, పాల్గొన్నారు.తహిశీల్దార్, కార్యాల యాంలో తహిశీల్దార్ పద్మావతి, మండల పరిషత్ కార్యాలయాలం వద్ద ఎంపిడివో మార్రెళ్ల భవాని, మండల విద్యాశాఖ కార్యాలయాంలో ఎంఇఒ మస్తానయ్య,పోలీస్ స్టెషన్‌లో ఎస్.ఐ.జి.పుల్లారావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

## ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

వాకాడు, ఆగస్టు 15, ప్రభాతవార్త

ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే మనం స్వేచ్ఛగా జెండాను ఎగరవేస్తున్నామని వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వాకాడులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని ఎంపిడిఓ గోపినాధ్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి జెండాను ఎగురవేసారు. పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయం, పోలీసు స్టేషన్, ఇంరిగేషన్ కార్యాలయం, గురుకుల పాఠశాల, సచివాలయాలు, మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండాను ఎగరవేశా రు. పలువురు నాయకులు, అధికారులు స్వాతంత్ర దినోత్సవం కార్యక్రమం గురించి మాట్లాడారు.

## ఉత్తమ అధికారిగా సెబ్ సీఐ ప్రసన్న లక్ష్మి

వాకాడు, ఆగస్టు 15, ప్రభాతవార్త



అవినీతికి కేరాఫ్ కోట , వాకాడు, చిట్టమూరు మండలాల్లో టైగర్‌గా పిలవబడే స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ ప్రస న్న లక్ష్మికి మంగళవారం 77 వ స్వాతంత్ర దినోత్సవం సంద ర్భంగా గూడూరు శాసన సభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావు, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్న ప్రసన్న లక్ష్మికి, సిబ్బంది రాజశేఖర్ బాలసుబ్రమణ్యం, కృష్ణ ఉత్తమ అవా ర్డులు అందుకున్న సందర్భంగా వాకాడు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోకార్యాలయం సిబ్బంది హర్షం వ్యక్తం చేసారు.

## దారి విషయమై ఘర్షణ- పలువురికి గాయాలు

తడ, ఆగస్టు 15 ప్రభాతవార్త

తడ మండలం తడకండ్రిగలో ఒక దారి విషయమై జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. మం గళవారం తడ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు చిలమత్తూరు కృష్ణమూర్తి తనపై గుమ్మిడిపూడి చక్రవర్తి, రాజేంద్ర, మునస్వామి, సులోచనలు దాడి చేశారని ఫిర్యాదు చేశారు. తన ఇంటి సమీపంలో హద్దురాళ్లను పీకేసి టైల్స్ మీద ఇసుక ట్రాక్టర్ పోతుంటే అడ్డుకున్నందుకు దాడి చేసినట్లు కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు. గుమ్మిడిపూడి రాజేంద్రన్ మరో ఫిర్యాదు చేస్తూ చిలమత్తూరు కృష్ణమూర్తి తన మీదనే దాడి చేసి గాయపరిచాడని, అంతు చూస్తానని బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## రాష్ట్ర రక్షణ కోరుతూ సీపీఐ బస్సు యాత్ర

కోట, ఆగస్టు 15 ప్రభాతవార్త

రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందాం .. అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బస్సు ప్రచార యాత్ర ఈనెల 17న విశాఖలో ప్రారంభమవుతుందని తిరుపతి జిల్లా సీపీఐ కార్యదర్శి ప్రభాకర్ చెప్పారు. ఆయన మంగళవారం కోటలో విలేకర్లతో మాట్లాడారు. సెప్టెంబర్ 8 న తిరుపతిలో నిర్వహించే భారీ బహిరంగ భతో యాత్ర ముగుస్తుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైకాపా పాలనలో అభివృద్ది కుటంటుపడిందని, వ్యవసాయం పారిశ్రామిక,నీటి పారదల రంగాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఉత్తమ సేవా పురస్కారాలు

దొరవారిసత్రం, ఆగస్టు 15 ప్రభాతవార్త

దొరవారిసత్రం తహశీల్దార్ గోపీనాథరెడ్డి, ఎంపిడిఓ శింగయ్య, ఎస్ఐ జె.తిరుమలరావుకు మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతిలో జరిగిన వేడుకల్లో తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా తహశీల్దార్ గోపీనాథరెడ్డి, ఎంపిడిఓ శింగయ్యకు, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి చేతుల మీదుగా ఎస్ఐ జె.తిరుమలరావుకు పురస్కారాలు అందజేశారు. వీరు చేసిన సేవలకు ప్రతిఫలంగా అవార్డులు అందజేశారు. మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులకు అవార్డులు రావడంతో స్థానిక నాయకులు, ప్రజలు, సహ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## కోట ఎస్ఐకి ఉత్తమ పురస్కారం

కోట, ఆగస్టు 15 ప్రభాతవార్త

విధి నిర్వహణలో అంకితభావంతో మండల ప్రజలకు సేవలు అందించినందుకు గాను కోట ఎస్ఐ జి.పుల్లారావుకు, కానిస్టేబుల్ ఎస్‌కె జహీర్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

## పేటలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు...

నాయుడుపేట రూరల్ ఆగష్టు 15 ప్రభాతవార్త ;



నాయుడుపేట మండలంలోని ప్రభుత్వ,ప్రవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో స్వతంత్రదినోత్సవ వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు,నాయకులు కలిసి మంగళవారం ఘనంగా నిర్వహించారు.అనంతరం నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి ,రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ రాజే ద్ర,పోలీస్‌స్టేషన్‌లో సిఐ నరసిహారావు,పాఠశాలల్లో ప్రధానో ఉపాధ్యాయులు జాతీయ జెండా ఎగరవేసి వంధనం చేశారు కార్యక్రమంలో ఎస్సై,పోలీసులు,ఎంపిడిఓ శివప్రసాద్,కార్యధర్శిలు,విఆర్‌ఓలు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,తదితరులు ఉన్నారు.

## నాయుడుపేటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నాయుడుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి సంయుక్త, పోలీసుస్టేషన్‌లో అర్బన్, రూరల్ సిఐలు నరసింహారావు, వైవీ సోమయ్య, మున్సిపల్ కార్యాలయంలో, బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక జాతీయ జెండా ఎగురవేశారు. గౌరవ వందనం స్వీకరించారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలమే దేశానికి స్వాతంత్ర్యం - ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ



వెంకటగిరి, ఆగస్టు 15, ప్రభాతవార్త: స్వాతంత్ర్యం కోసం పోరాడిన త్యాగధనులను ఎన్నటికీ మరువరాదని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ తెలిపారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వెంకటగిరి పురపాలక సంఘం కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం ప్రాణాలర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు, కమిషనర్ వెంకటరామయ్య, వైస్‌చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు విజయలక్ష్మి, పూజారి లక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాలకృష్ణ, నారాయణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ సౌజన్యరెడ్డి, తొమ్మిదవ బెటాలియన్ వద్ద కమాండెంట్ పి.ప్రకాష్, పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ నరసింహారావు, ఏఎంసీ కార్యాలయం వద్ద ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, పిఆర్ కార్యాలయం వద్ద లక్ష్మీనారాయణ జాతీయ జెండా ఎగురవేశారు.

## ఓజిలి ఎంఇఓ శైలజకు ఉత్తమసేవా పురస్కారం

ఓజిలి, ఆగస్టు 15 ప్రభాతవార్త



ఓజిలి మండల విద్యాశాఖ అధికారి శైలజకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆమె చేసిన చేవలకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు, ఎంఎల్‌సీ మేరిగ మురళీధర్ చేతుల మీదుగా మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఉత్తమ సేవా పురస్కారం ప్రశంసాపత్రం అందుకున్నారు.

## పెళ్లకూరు పోలీసుస్టేషన్‌లో వేడుకలు

పెళ్లకూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త

మండల కేంద్రమైన పెళ్లకూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు ఎస్ఐ చింతల కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం ఎస్ఐ చింతల కృష్ణారెడ్డి కేక్ కట్ చేసి పోలీసు సిబ్బందికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ ఎన్.సుబ్రహ్మణ్యం, హెడ్ కానిస్టేబుల్ సిఎ కృష్ణయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పెళ్లకూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పెళ్లకూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త



పెళ్లకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పెళ్లకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ సురేష్‌బాబు, జడ్పిటిసి ప్రిస్కిల్లా, వైసీపీ నాయకులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



సూళ్లూరుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో జాతీయ జెండా ఎగురవేసి స్వీట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో డిఇ చంద్రశేఖర్, రోటరీ క్లబ్‌లో అధ్యక్షుడు ఎ.దశరథరెడ్డి, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. రోటరీ క్లబ్‌కు చెందిన వినయ్‌కుమార్, నాదెండ్ల శాంతకుమారి, శివకుమార్‌రెడ్డి, సుంకర ప్రతిమ, సాయిరామ్, వాసవీ వనితా క్లబ్ ప్రెసిడెంట్ సునీత, కళావతి, శైలజ, పద్మజ, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చోరీల కేసులో చొరవ చూపినందుకు తడ ఎస్ఐకి ప్రశంసాపత్రం

తడ, ఆగస్టు 15 ప్రభాతవార్త



ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో వివిధ చోరీలకు సంబంధించి నిందితు లను సకాలంలో పట్టుకొని, పోయిన వస్తువులను స్వాధీనం చేసుకున్నందుకు తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డికి ప్రశంసాపత్రం లభించింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యాన ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి ఈ ప్రశంసాపత్రం అందజేశారు. తడ మండల పరిధిలోని 20 కేసులకు సంబంధించి ఎస్ఐ తన సిబ్బంది సహకారంతో చొరవ చూపించారు. పలు చోరీల కేసులకు సంబంధించి విలువైన సామగ్రిని, ముఖ్యంగా మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో తడ పోలీసులు పలువురిని కూడా ఉన్నతాధికారులు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

# తిరుపతి డివిజన్

## స్విమ్స్ సమగ్రాభివృద్ధికి టిటిడి చర్యలు ప్రారంభం

### స్వాతంత్ర్య దినోత్సవ సభలో జేఈఓ సదాభార్గవి



తిరుపతి టౌన్, ఆగస్టు 15 ప్రభాతవార్త : స్విమ్స్ సమగ్రాభివృద్ధి టిటిడి అన్ని చర్యలు ప్రారంభించడం జరుగుతుందని జేఈఓ, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదాభార్గవి తెలిపారు. మంగళవారం స్విమ్స్ శ్రీ పద్మావతి మెడికల్ కళాశాల మైదానంలో జరిగిన భారత 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా సదాభార్గవి విచ్చేసారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన 25 మంది వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను బహుకరించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. శరత్ బి సింగ్, స్విమ్స్ డీన్ డా. అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డా. అపర్ణబిట్ల, మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపల్ డా. మాధవి, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ డా. సుధారాణి ఇతర విభాగాధిపతులు వైద్యులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరులో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



తిరుచానూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త : తిరుచానూరులో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి జెండాను ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్‌లో సిఐ శివప్రసాద్‌రెడ్డి జెండా ఆవిష్కరించి వందనం సమర్పించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శివ శంకర్ రాజు, ఎస్ఐలు చిరంజీవి, జగన్నాధ్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుని కుటుంబాన్ని ఆదుకుంటాం: చైర్మెన్



శ్రీకాళహస్తి, ఆగస్టు 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటన సందర్భంగా సోమవారం రాత్రి ఆలయాన్ని శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంగతి తెలిసిందే. మంగళవారం పోస్టు మార్టం చేసి శవాన్ని కుటుంబసభ్యులకు అందించారు. బుధవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు నరేంద్ర పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. సిబ్బంది కలసి మృతుని కుటుంబానికి రూ.50వేల నగదును శ్రీనివాసులు అందించారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, పారిశుధ్య ఇన్‌చార్జి కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్‌పై శవం

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రేణిగుంట మధ్య ఏర్పేడు రైల్వేస్టేషన్ సమీపంలోని కృష్ణాపురం వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని రేణిగుంట పోలీసులు కనుగొన్నారు. రెండు పట్టాల మధ్య కనుగొన్న శవానం ఆనవాలను బట్టి బహుశా రైలులో పయనిస్తూ ప్రయాదవశాత్తు జారి పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుని వద్ద రైల్వేటిక్కెట్ కాని గుర్తింపు కార్డుల్లేదన్నారు. మృతుని వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. సంఘటనా స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ నరసింహులు పరిశీలించారు. శవాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి రైల్వే ఎస్‌సి కే.రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మువ్వన్నెల జెండాకు గౌరవ వందనం



చంద్రగిరి, ఆగస్టు 15 ప్రభాతవార్త: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, రెవెన్యూ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ శిరీషా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ మోహన్‌బాబు, మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ఎంఈఓ శ్రీవరం లలితకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. రామిరెడ్డిపల్లి పంచాయతీలో సర్పంచ్ కోటాల చంద్రశేఖర్ రెడ్డి, చంద్రగిరి కోటలో సీనియర్ సిఏ ఏ.ప్రవీణ్‌కుమార్, పోలీస్ స్టేషన్‌లో సిఐ రాజశేఖర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీలో తహశీల్దార్ శిరీషా, ఎగురవేశారు. ఆర్‌ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్‌బడ్స్ స్కూల్ చైర్మన్ హితేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అదేవిధంగా తొండవాడ వద్దగల హీరా ఉర్దూ స్కూల్ (మదర్సా)లో ప్రిన్సిపాల్ షేక్ జాన్ ముబారక్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, రాజులగారి సుజాత, మాదవరెడ్డి, అజీజానుస్రత్ బహార్, కోఆప్షన్ ఔరంగజేబు, ఎంపిడిఓ రమేష్‌బాబు, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎస్ఐలు వంశీధర్, హిమబింధు, రవీంద్రనాధ్, ఈఓ మహేశ్వరయ్య, హీరా స్కూల్ మేనేజర్ మొఘల్ అబ్దుల్ అజీజ్, నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మస్తాన్, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, చేగు గోవర్ధన్ గుప్తా, విజయ్‌కుమా రెడ్డి, నజరత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



రామచంద్రాపురం, ఆగస్టు 15 ప్రభాతవార్త: వాడవాడలా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గిరిబాబు, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, ఎంపిడిఓ మహ్మద్‌రఫీ, సింగిల్ విండో కార్యాలయంలో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సిఈఓ కన్నయ్య, కమ్మకండ్రిగ జడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసి చైర్మన్ బాలయ్య, నెత్తకుప్పం ఎస్‌ఎంసి చైర్మన్ ప్రసాద్, పిళ్ళారికోన అమృతసరోవర్ కొలనులో ఏపిఓ హంసవేణి, ఎఫ్ఏలు ఇరగం రెడ్డి, పురుషోత్తం జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

## సాధువులకు అన్నదానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ శ్యాం జన్మదిన సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డికి నమ్మిన బంటుగా ఉన్న బుల్లెట్ శ్యాంకు ధర్మకర్తల మండలిలో అవకాశం కల్పించారు. ఆయన జన్మదిన సందర్భంగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి సారధ్యంలో కేక్ కట్ చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని సాధువులకు అన్నదానం జరిపారు. ఆటో డ్రైవర్లకు వస్త్రదానం చేసారు.

## ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగఫలమే

-ఉప కార్మిక కమిషనర్ బాలు నాయక్



తిరుపతిరూరల్, ఆగస్టు15 ప్రభాతవార్త: ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగాల ఫలితం గానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని ఉప కార్మిక కమిషనర్ బాలు నాయక్ అన్నారు. తిరుపతి జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండా వందనం గావించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్స్ బి.వి.యస్. కృష్ణారెడ్డి, చిన్నలాలప్ప, సహాయ కార్మిక అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

**-శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. 1971 భారత-పాకిస్థాన్ యుద్దంలో ప్రత్యక్ష్యంగా పాల్గొన్న విశ్రాంత సైనికుల హవాల్దార్ కేశవులు, నాయబ్ సుబేదార్ సూర్య నారాయణ రావులను జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ రెడ్డిశేఖర్, డాక్టర్ సరళ, డాక్టర్ వాణి, డాక్టర్ సంతోష్, డాక్టర్ లీలావతి, డాక్టర్ మంజుల, డాక్టర్ నాగిరెడ్డి లు పాల్గొన్నారు.

-తిరుపతి రైతుబజారులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు:

రాయలచెరువు రోడ్డులో ఉన్న రైతు బజారులో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ అక్తర్, షాపు యజమానులు ముచ్చేలి సుబ్రమణ్యంరెడ్డి, ధర్మక్క, రాధిక, సుధా తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు:

తిరుపతిరూరల్ ఎంపిడిఓ కార్యాలయంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంపిడిఓ జెండాను ఆవిష్కరించి, వందనం గావించారు. అనంతరం నా భూమి-నాదేశం భూమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ మమతరాణి, ఎంపిటిసి జయకర్, కార్యాలయ సిబ్బంది ప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంశా పత్రం అందుకున్న అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానీభాష



తిరుపతిరూరల్ రామానుజపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పొట్టేలి లీలారాణి రవికుమార్



ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి



శ్రీ పద్మావతి బాలికల పాఠశాలలో పంద్రాగస్టు వేడుకలు



తిరుచానూరు భువనేశ్వరి విద్యానికేతన్ స్వాతంత్ర దినోత్సవం



వడమాలపేట ఎస్వీ పురంలో విద్యార్థుల ర్యాలీ



తిరుపతి టాస్క్‌ఫోర్సులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నగరి సీఐ



సత్యవేడు శ్రీసిటీ లోని బిజినెస్ సెంటర్ వద్ద డిఎస్పీ జగదీష్

## పేదలకు పండ్లు,పాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి కిచెందిన జమియతుల్ ఉలమ సారధ్యంలో 77వ స్వాతంత్ర్య దదినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు రోట్టె అందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు అహమ్మద్ హుసేన్, శ్రీకాళహస్తి అధ్యక్షుడు ముఫ్తీ నాయిం అహమ్మద్, హ్యూమన్‌రైట్స్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, మౌలానా రేహన్ సాహెబ్, ఎస్ఆర్ రఫీ, మౌలానా మహమ్మద్ అలీ, హుమయూన్, షాహి, లాల్‌బాషా, జామీయా మస్‌జిద్ యువత పాల్గొన్నారు.




తొట్టంబేడు మండల కాలర్యాలయంలో ఎంపిపి, జడ్పీటీసీలు జెండాను ఆవిష్కరించారు

## విభేధాలు విడనాడి విద్యాభివృద్ధికి కృషి చేయండి..!

రాచంద్రాపురం, ఆగస్టు 15 ప్రభాతవార్త: ఉపాధ్యాయులు విభేధాలు విడనాడి విద్యాభివృద్ధికి కృషిచేయాలని కుప్పం బాదూరు జడ్పీహైస్కూల్ ఎస్‌ఎంసి చైర్మన్ సురేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం 77వ స్వాతంత్ర్య వేడుకలను పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో కొంత మంది ఉపాధ్యాయుల నడుమ వర్గపోరు నడుస్తుండటం భాధాకరమన్నారు. ఎంతో మంది స్వాతంత్ర్య సమయోధులు తమ ప్రాణాలర్పించి తనకు స్వాతంత్ర్యం సిద్ధింపజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయురాలు సుజన కుమారి, గ్రామస్థులు మారయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



పుత్తూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎ.హరి, డి.జయప్రకాశ్‌లు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో:**

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్‌సిసి విద్యార్థులు సైనిక వందనం చేశారు. బత్తలవారికండ్రిగకు చెందిన మాజీ సైనికుడు బి.గజేంద్రనాయుడును ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య, పిడి సూరిబాబు, ఎన్‌సిసి అధికారి ఎం.శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ రఘురామన్, ఇంకా అధ్యాపకులు డాక్టర్ వాణిశ్రీ, ఎ.నాగేశ్వరరావు, టి.నరసింహులు, పి.సుజన, డాక్టర్ కృష్ణయ్య తదితర అధ్యాపక, విద్యార్థులు పాల్గొన్నారు.

**తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో :**

మునిసిపాలిటీలోని 22వ వార్డులో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు, స్థానిక కౌన్సిలర్ అయిన గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సచివాలయంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి అర్పించి, వారి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు.

శేషసాయి, వివేకానంద, నారాయణ స్కూళ్లలో

శేషసాయి స్కూలులో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ గాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్లు డాక్టర్ కె.రమేష్, ఎస్‌వి సుబ్బయ్య, కె.ఎస్.మనోజ్, వై.వి.శారదా నరసింహన్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని వివేకానంద, స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డి.సదాశివం జాతీయ జెండా ఎగురవేసి విద్యార్థులకు దిశానిర్ధేశం చేశారు. విద్యార్థులు ఇండిపెండెన్స్ డే ఆకారంలో కూర్చుని వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. నారాయణ పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎజిఎం కిషోర్ పాల్గొని విద్యార్థులంతా బాగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్ వెంకటేష్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ వైస్ ప్రిన్సిపల్స్ ప్రియ, సుబిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.








తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జ్ ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) టి.జితేంద్రనాథ్‌రెడ్డిచే జండా ఆవిష్కరణ



ఏర్పేడు ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణచే త్రివరణ పత్కావిశరణ



పేదలకు అన్నదానం చేస్తున్న డా॥పిసి.రాయులు, భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

## జెండా ఉంచా రహే హమారా...



రేణిగుంట, ఆగస్టు 15 ప్రభాతవార్త: జెండా ఉంచా రహే హమారా అంటూ రేణిగుంట పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి పలు చోట్ల వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలతోకలసి త్రివర్ణ పతాకాలను ఎగురవేసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రేణిగుంట వైసీపీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్, డీఎస్పీ, అర్బన్ సీఐ, రూరల్ సర్కిల్ కార్యాలయాల్లో, వివిధ పాఠశాలల్లో మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. తారక రామానగర్‌లో వైసీపీ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి(ఎంఎస్ఆర్), కరకంబాడి వైసీపీ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి, పాఠశాలల పిల్లలకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. విప్పమానుపట్టెడ ప్రాథమిక పాఠశాలలోసర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. పాత రేణిగుంట(అగ్రహారం) ప్రాథమిక పాఠశాలలో గుంటను పూడిపించి ఆట స్థలం చేసి పవిత్రరెడ్డి ప్రారంభోత్సవం చేసి పిల్లలతో ఆడుకున్నారు. రేణిగుంట(తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశ గొప్పతనాన్ని చాటుతూ జాతీయ జెండా గర్వంగా గగన సీమలో రెప రెపలాడింది. రైల్వేస్టేషన్ సమీపంలో కస్తూరిబా సమేత గాంధీ విగ్రహం వద్ద రైల్వే విశ్రాంత ఉద్యోగులు పవిత్రరెడ్డి సమక్షంలో ఘనంగా జెండా వందనం నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో ఐపీఎఫ్ సందీప్ జాతీయ జెండా ఎగురవేశారు. టీడీపీ నేతలు బజారు సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, డీఎస్పీ భవ్య కిషోర్, అర్బన్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ ఈశ్వరయ్య, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ఎంపీపీ సుజాత, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట సర్పంచ్ నాగేషం, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ జూలియన్ రాజు, వైసీపీ సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, వార్డు మెంబర్ల ఇన్‌చార్జి, వైసీపీ నేత సందీప్‌రెడ్డి, రైల్వే విశ్రాంత ఉద్యోగులు జయంతకుమార్, అసం, రాజేంద్ర, సంజీవ రాయప్ప, టీడీపీ నేతలు చంద్రారెడ్డి, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామినాయుడు, మహబూబ్ బాషా, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

